క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

నిమ్మనపల్లె: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాలతో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి శుక్రవారం మండలంలోని సామకోటవారిపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, దేవ కుమారి, నందిని, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఘనంగా దీప స్తంభం ప్రతిష్టాపన

కలికిరి: గ్రామదేవత ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకుల ఆధ్వర్యంలో నూతన దీప స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టించి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజా కార్యక్రమలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కలకడ : ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు తిరుపతికి చెందిన శ్రీ రమాదేవి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ అను తెలిపారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెర్వులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మేన్ కమల్‌నాథ, మాజీ సర్పంచ్ విశ్వనాథశెట్టి, పీఆర్‌ఓ భార్గవ్‌చంద్ర, రామయ్య, రామ సిద్దారెడ్డి, భువనేశ్వరి, యామిని, సుమలత పాల్గొన్నారు.

మసీదు భూములు కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముతవల్లీలు, ముస్లింలు

కలకడ : మసీదుల అభివృద్ధి కోసం కొనుగోలు చేసిన భూములను కాపాడాలని కలకడ టౌన్ మసీదుల ముతవల్లీలు కోరారు. శుక్రవారం తహసీల్దార్ పనికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కలకడ రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 164లో ఎకరం 4–35సెంట్లు, మరియు 0.65 సెంట్లు కలిపి మొత్తం 5 ఎకరాల భూమిని మసీదుల అభివృద్ధి కోసం కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. అయితే సదరు భూమి హక్కు దారులమంటూ కొందరు భూమి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై 2003 సంవత్సరంలో మదనపల్లె కోర్టులో, 2015 సంవత్సరంలో పీలేరు సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో దావా వేశామని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుని మసీదు భూములను కాపాడాలని కోరారు.

పరామర్శ



రమేష్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ గ్యారంపల్లె కస్పాకు చెందిన పీలేరు సాయిసురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ రమేష్ రెడ్డి తండ్రి టి. సహదేవరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం గ్యారంపల్లె కస్పాకు వెళ్లి రమేష్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సూర్యనారాయణ రెడ్డి, కిషోర్‌రెడ్డి, దాబా బాబు, రెడ్డిశంకర్‌రెడ్డి, బాలకృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

చిన్నమండెం: రికార్డులు సక్రమంగా చూపని వాహనదారులకు చిన్నమండెం ఎస్‌ఐ సుధాకర్ శుక్రవారంజరిమానా విధించారు. మల్లూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు లేకుండా ప్రయాణం చేయవద్దని ఎస్‌ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డున్నా... సింగిల్ బస్సు రాదాయె..!

- పలు మార్గాలకు బస్సుసౌకర్యం లేక జనం ఇబ్బందులు
- రూ.17.45 కోట్లతో గ్రామాలకు తారు రోడ్లు ఏర్పాటు
- రోడ్లు ఉన్నా నిరుపయోగంగా మారిన వైనం



తరిగొండ నుంచి తలారివాండ్లపల్లె వరకు వేసిన తారు రోడ్డు

గుర్రంకొండ: మండలంలో పలు మార్గాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్లు వేశారు. అయితే పలు రూట్లలో బస్సు సర్వీస్‌లు లేవు. ఉన్న రూట్లలో సమయానికి రాక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ప్రజలు, విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సమయానికి బస్సులు రాక పోవడంతో అవస్థలు పడుతున్నారు. గతంలో కొంతకాలం పాటు ఆర్టీసీ ఆధికారులు కొన్ని మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపారు. తర్వాత బస్సు సర్వీసులు ఒక్కసారిగా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.17.45 కోట్లతో తారురోడ్లు

మండలంలోని పలు గ్రామాలను ప్రధాన రహదారులకు కలుపుతూ బస్సు మార్గాల కోసం గతంలో రూ. 17.45 కోట్లతో తారు రోడ్లు నిర్మించారు. మండలంలోని తరిగొండ నుంచి శెట్టివారిపల్లె మీదుగా తలారివాండ్లపల్లె వరకు రూ.3 కోట్లతో రోడ్డు వేశారు. తరిగొండ నుంచి బోడి గుట్టవారకు రూ. 1.20 కోట్లతో, శ్రీనివాసపురం నుంచి ఎగువ బురుజు పల్లె వరకు రూ.3 కోట్లతో ఆర్ అండ్ బీ అధికారులు రోడ్లు వేశారు. ఎగువఅమిలేపల్లె క్రాస్ నుంచి కలకడ మండలం వడ్డిపల్లె రూ. 2 కోట్లతో రోడ్లు వేశారు. దిగువ తొట్లివారిపల్లె నుంచి గెరికుంటపల్లె మీదుగా నడిమికంద్రిగ వరకు రూ. 2.25 కోట్లతో రోడ్లు వేశారు. మొటుకు క్రాస్ నుంచి మొటుకుమీదుగా ప్యారంపల్లె వరకు రోడ్డు వేశారు. వీటితో పాటు సింగిల్ రోడ్డుగా ఉన్న కలకడ–గుర్రంకొండ మార్గాన్ని రూ. 6 కోట్లతో డబుల్ రోడ్డుగా మార్చారు.

రోడ్లున్నా నడవని బస్సులు

మండలంలో సుమారుగా 25 గ్రామాల ప్రజలు సకాలంలో బస్సు సౌకర్యాలు లేక నానా కష్టాలు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు రోజూ వందల మంది విద్యార్థులు వెళ్తుంటారు. ఉదయం పాఠశాల సమయానికి విద్యార్థులతో పాటు సామాన్య ప్రజలు కూడా బస్సులు లేక అవస్థ పడుతున్నారు. మొటుకు క్రాస్ నుంచి ప్యారంపల్లెకు గతంలో బస్సు నడపాలని పలుమార్లు గ్రామస్తులు అధికారులు అర్జీలు పెట్టుకొన్నారు. గుర్రంకొండ నుంచి దిగువ అమిలేపల్లె, గంగిరెడ్డిగారిపల్లె, నక్కలవాండ్లపల్లె, ఎగువబురుజుపల్లె, రామాపురం, తరిగొండ మీదుగా వాల్మీకిపురానికి గతంలో ఆర్టీసీ బస్సులు నడిపేవారు. తదనంతర కాలంలో వాటిని రద్దు చేశారు. గుర్రంకొండ నుంచి మర్రిమాకుల పల్లె, సింగంవారిపల్లె, రంగప్పగారి పల్లె వరకు ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు నడిపేవారు. కొంతకాలంగా బస్సును నిలిపివేశారు.

ఆటోలే దిక్కు

ఈ మార్గాల్లో ప్రయాణీకులు గమ్య స్థానాలకు చేరుకోవాలంటే ఆటోలే దిక్కు. ఆటోల్లో ఎక్కువ వుంది ప్రయాణీకులను ఎక్కించుకొని వెళుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యార్థులు కళాశాలకు వెళ్లాలన్నా ఆయా మార్గాల్లో ఆటోల్లోని ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే ఈ రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని పాలకుల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. అధికారులు స్పందించి ఇప్పటికైనా బస్సు సర్వీసులు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సులు నడపాలి



మా మార్గంలో బస్సు సర్వీసులు నడపడం లేదు. రోడ్డు మార్గం ఉన్నా బస్సు లేక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో గమ్య స్థానాలకు చేరుకోలేక జనం ఇబ్బంది పడుతున్నారు. నిత్యావసర సరకులు, సాగుకు సంబంధించిన ఎరువులు తెచ్చుకోవాలంటే నానా కష్టాలు పడుతున్నాము.

– గంగులమ్మ, గంగిరెడ్డిగారిపల్లె

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



మా రూట్‌లో గతంలో బస్సు సర్వీసు నడిపేవారు. ఏడేళ్లుగా బస్సు నిలిపివేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు సమయానికి వెళ్లలేక కష్టాలు పడుతున్నారు. చివరకు ఆటోలో దిక్కుగా మారాయి. అవి కూడా సకాలంలో అందుబాటులో ఉండవు. రెడ్డెప్ప,చింతలవారిపల్లె

15 శాతం వృద్ధి రేటు లక్ష్యం

డీఏఓ చంద్రానాయక్



మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

మదనపల్లె : తక్కువ ఖర్చుతో పంటల ఉత్పత్తి, ఉత్పాదకతను అధికం చేసి వ్యవసాయంలో 15శాతం వృద్ధిరేటును సాధించేందుకు రైతుసేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే) సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ ఆదేశించారు. స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం మదనపల్లె వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతుసేవాకేంద్రాల సిబ్బందిని రబీ సీజన్‌కు సంసిద్ధులను చేయడంతో పాటుగా కెపాసిటీ బిల్డింగ్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. సమావేశానికి డీఏఓ చంద్రానాయక్, కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్, ఏడీఏ శివశంకర్, డీఆర్సీ ఏడీఏ మజీద్ అహ్మద్, అశోక్‌రెడ్డి, వెంకటమోహన్, రమేష్‌రాజు, సుచిత్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఏఓ చంద్రానాయక్ మాట్లాడుతూ 2024 నుంచి 2029 వరకు ఐదేళ్ల వ్యవసాయశాఖ ద్వారా జిల్లాలో 15శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా ఆర్‌ఎస్‌కే సిబ్బంది పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, వేరుశెనగ, మొక్కజొన్న తదితర పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు అవసరమైన సాంకేతిక సహాయం, సలహాలు, సూచనలు రైతులకు అందించాలని సూచించారు. రైతులకు అవసరమైన జిప్సం, సూక్ష్మపోషకాలకు ఇండెంట్ పెట్టి 50 శాతం సబ్సిడీతో వాటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. యాంత్రిక వ్యవసాయం, సమాచార, ప్రసార పరిజ్ఞాన(ఐసీటీ) వాడకాన్ని వ్యవసాయంలో ప్రోత్సహించాలని చెప్పారు. రబీ సీజన్‌కు సంబంధించి ఆరునెలల పాటు ఎరువులు అవసరానికి అనుగుణంగా నెలవారీగా కేటాయింపుల ప్రకారం సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. కార్యకరమంలో మదనపల్లె డివిజన్‌లోని మండల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీడీఓ గంగయ్య

కురబలకోట: కురబలకోట ఎంపీడీఓగా సి. గంగయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న ఎంపీడీఓ హరినారాయణ ములకలచెరువుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడ రెండు సార్లు ఎంపీడీఓగా పనిచేసిన సి. గంగయ్య తిరిగి బదిలీలో భాగంగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. వివిధ అభివృద్ధి, ప్రజా సమస్యలపై సత్వర చర్యలు తీసుకుంటానని గంగయ్య తెలిపారు.

ఎంపీడీఓగా ఉపేందర్‌రెడ్డి

తంబళ్లపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఎంపీడీఓగా ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పీలేరు ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ ఏఓగా థామస్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన బి.కొత్తకోటలో పని చేస్తూ బదిలీపై వచ్చారు.

వైభవంగా సంతోషిమాత రథోత్సవం



విద్యుద్దీపాలతో అలంకరించిన సంతోషిమాత రథోత్సవం

బి.కొత్తకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయాల్లో విశేష కార్యక్రమాలు జరిగాయి. స్థానిక కాళికమ్మ ఆలయంలో కాళికాదేవి లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కిరీటం, ఆభరణాలను అలంకరించగా ఉదయం ప్రత్యేకపూలు, పంచామృత అభిషేకాలు, లలితా సహస్రనామాలతో అర్చనలు జరిపారు. ఉభయదార్లు సువర్ణచారీ కుటుంబం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు పసుపు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకపూలు, కిరీటం, ఆభరణాలతో అలంకరణలు చేశారు.

- బి.కొత్తకోటలో శుక్రవారం రాత్రి సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. రాత్రంతా పట్టణపుర వీధుల్లో రథోత్స కార్యక్రమం వైభవంగా సాగింది. భక్తులకు ఇళ్లవద్ద రథానికి పూజలు చేశారు. కోలాట భజనలతో వేడుక అలరించింది.

ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ కె. మంజుల

ములకలచెరువు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ కె. మంజుల కోరారు. శుక్రవారం ఆమె తహసీల్దార్ ప్రదీప్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు సీజ్ చేసిన ఇసుకను కూటమి ప్రభుత్వం నాయకులు తరలించుకొని పోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధి పనుల నిమిత్తం ఇసుకను అధికారికంగా తరలించుకొని నిల్వ ఉంచారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక నిల్వలను కుట్రలు పని అధికారులపై ఒత్తిడి పెట్టి సీజ్ చేయించారు. అయితే సీజ్‌చేసిన ఇసుకను టీడీపీ నాయకులు రాచమార్గంలో తరలిస్తున్నా కూడా అధికారులు నిమ్మకు నీరుఎత్తినట్లు వ్యవహరిస్తున్నారనే కథనాన్ని సాక్షి పత్రికలో బుధవారం రోజు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. స్పందించిన రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని నామమాత్రంగా పరిశీలించారు. అనంతరం మరుసటిరోజే ఇసుక తరలించడానికి ట్రాక్టర్లను ఇసుక డంప్ వద్దకు వెళ్లారు. గమనించిన స్థానికులు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించడంతో అధికారులను గమనించిన గుర్తు తెలియని వారు అక్కడి నుంచి పారిపోయారు.

హైకోర్టు స్టే విధించినా..

అభివృద్ధి పనుల కోసం మండలంలోని జవకల కోట వద్ద సర్వే నంబర్లు 725(ఏ), 729(ఏ)లో ఇసుకను నిల్వ ఉంచారు. జూలై 9వ తేదీ ఇసుక నిల్వలను గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేశారు. అనంతరం అదే నెల 20వ తేదీ నిల్వ ఉంచిన ఇసుకను అక్కడి నుంచి తరలించకుండా, అక్కడి అభివృద్ధి పనుల కోసం ఉపయోగించేలా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి స్టే తెచ్చారు. స్టే ను జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారులకు సైతం పంపించారు. అయినా ఇసుకను తరలిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

సీజ్ చేసిన ఇసుకను తరలిస్తే చర్యలు

సర్వే నంబర్లు 725(ఏ), 729(ఏ)లో నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తే వారిపై చట్ట పరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రదీప్ ఈ సందర్భంగా తెలిపారు. వేరే పనుల కోసం తరలించేకి ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. తరలిస్తూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రజల ఆదరాభిమానాలు పొందాలి



మయూర స్వీట్స్, బేకరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని బెంగళూరు బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మయూర స్వీట్స్, బేకరీని శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ కర్నాటకలో సుమారుగా 80 బ్రాంచీలతో స్వీట్స్, బేకరీ షాపుల్లో మంచి పేరు దక్కించుకున్న మయూర స్వీట్స్, బేకరీ ఆంధ్రప్రదేశ్‌లో తమ మొదటి బ్రాంచ్‌ను మదనపల్లెలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణ ప్రజల అభిరుచులకు అనుగుణంగా మయూర స్వీట్స్, బేకరీ, నాణ్యమైన ఉత్పత్తులను విక్రయించి ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. ఖాదర్‌కుట్టి, అలీ.హరి, నాయకులు విద్యాసాగర్, మస్తాన్, సుధాకర్ పాల్గొన్నారు.

సన్మానం

నిమ్మనపల్లె : మండల విద్యుత్ శాఖ నూతన ఏఈగా పి.నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వసంత్ కుమార్ రెడ్డి మదనపల్లెకు బదిలీ కాగా, కురుబలకోటలో పనిచేస్తున్న పి.నాగరాజు మండల విద్యుత్ శాఖ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈని విద్యుత్ శాఖ సిబ్బంది సన్మానించారు.

అస్పియా మృతిపై సమగ్ర విచారణ చేయాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

వాల్మీకిపురం: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన చిన్నారి బాలిక అస్పియా అంజుమ్‌ను (07) కిడ్నాప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకిపురం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జామియ మసీదు నుంచి గాంధీ బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ బస్టాండ్ వద్ద మౌనం పాటించి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారి అస్పియా మృతిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, అన్ని మతాల పెద్దలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రమాలల సమర్పణ



స్వామి వారికి పవిత్ర మాలలు సమర్పించిన అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పవిత్ర మాలల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రమాలల సమర్పణ, శాంతి హోమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం గావించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలు రకాల నైవేద్యాలు స్వామివారికి సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ టీమ్ ప్రతినిధుల ఎంపిక



బాస్కెట్ బాల్ టీమ్ ప్రతినిధులుగా ఎంపికైన విద్యార్థులు

కురబలకోట: అనంతపురం జేఎన్‌టీయూ బాస్కెట్ బాల్ పురుషుల టీమ్ ప్రతినిధిగా అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ చివరి సంవత్సరం సీఎస్‌ఈ డేటా సైన్స్ విద్యార్థి జీవన్, యూనివర్సిటీ మహిళల బాస్కెట్ బాల్ టీమ్ ప్రతినిధులుగా అదే కళాశాలకు చెందిన నిహిత కృష్ణ, లక్ష్మి, తనూజ, పి. వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు.

మండల అభివృద్ధే ధ్యేయం

సంబేపల్లె : మండల అభివృద్ధే మన ధ్యేయం అని మండలాధ్యక్షురాలు నాగ శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవన్‌లో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. దుద్యాల వద్ద కొండకింద హరిజనవాడలో నీటిఎద్దడిని పరిష్కరించాలని మండల ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ అధికారులకు విన్నవించారు. గుట్టపల్లె సమీపంలోని జగనన్న కాలనీని ఆక్రమిస్తున్నారని సర్పంచి చిదంబరరెడ్డి తహసీల్దారు వెంకటేశ్వర్లుకు తెలిపారు. సచివాలయ సముదాయాలను పరిశుభ్రంగా ఉండేందుకు అటెండర్‌ను నియమించాలని సభ్యులు కోరారు. శెట్టిపల్లె పంచాయతీలో ఈ క్రాప్ నమోదులో అక్రమాలు జరిగాయని, వెంటనే రికార్డులు పరిశీలించాలని జడ్పీటీసీ కవితా రమేష్‌రెడ్డి అధికారులను కోరారు. ప్రకాస్ నగర్ కాలనీ సమీపంలోని జెడ్‌పీసీ భూముకు పాసు పుస్తకాలు రాలేదని సర్పంచ్ మోహన్ తహసీల్దారుకు తెలిపారు.

7 నుంచి తపాలాశాఖ వారోత్సవాలు

పీలేరురూరల్ : ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలాశాఖ జాతీయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి. వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా 7న అధిక మొత్తం పోస్టల్ మెయిల్ సర్వీసును ఉపయోగించుకునే వారితో సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 8 న స్టాంపుల సేకరణపై అవగాహన, 9న మారథాన్, మొక్కలు నాటే కార్యక్రమం, 10, అంత్యోదయ దివస్‌లో భాగంగా ప్రత్యేక ఆధార్ నమోదు, ఈపీపీబీ సేవలపై అవగాహన, 11న పోస్టాఫీసు అందించే వివిధ రకాల సేవలపై కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

అఖిలాండేశ్వరీ.. పాలయమాం గౌరీ..!

గురువారం ఉదయం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పది రోజులపాటు అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు గురువారం పలు ఆలయాల్లో బాలత్రిపురసుందరిగా భక్తులకు దర్శమిచ్చారు. రెండో రోజు శుక్రవారం గాయత్రీ దేవి అవతారంలో, మూడో రోజు అన్నపూర్ణాదేవిగా, నాలుగో రోజు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవిగా, ఐదోరోజు లలితా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమివ్వనున్నారు. ఆరో రోజు మహాలక్ష్మీదేవి అవతారంలో, ఏడో రోజు సరస్వతీ దేవి అవతారంలో, ఎనిమిదో రోజు కనకదుర్గాదేవి, తొమ్మిదో రోజు మహిషాసుర మర్ధని దేవి అవతారంలో దర్శనమిస్తుంది. పదో రోజు రాజరాజేశ్వరీ దేవి అవతారంలో దర్శనమిస్తుంది. మదనపల్లె క్లస్టర్ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని ఆయా ఆలయాల్లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



మదనపల్లె సిటీ: గాయత్రీదేవి అలంకారంలో వాసవీమాత



కేవీపల్లె : ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరిదేవి అమ్మవారు




పీలేరు: గాయత్రీదేవి అలంకారంలో అంకాలమ్మ తల్లి



కలికిరి: గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న ఎల్లమ్మతల్లి



గుర్రంకొండ: గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన రెడ్డెమ్మ తల్లి



వాల్మీకిపురం: పద్మావతి దేవి అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీమాత